


అధ్యక్షులు డీటర్ ఎఫ్. ఉక్డార్ఫ్ గారిచే
ప్రథమ అధ్యక్షత్వమందు రెండవ సలహాదారులు

# ఆయన పిల్లలకు దేవుని వాక్యము

స్త్రీ పురుషులను సృష్టించిన తరువాత దేవుడు చేసిన మొదటి పని వారితో మాట్లాడడమేనని లేఖనాలు మనకు చెప్తున్నాయి. [1] వారికి ఇవ్వడానికి ఆయన ముఖ్య సమాచారాన్ని, విలువైన సూచనలను కలిగియున్నారు. వారిపైన భారం మోపడమో లేక వారిని ఆందోళనకు గురిచేయడమో ఆయన ఉద్దేశ్యం కాదు, కానీ సంతోషానికి మరియు నిత్య మహిమకు వారిని నడిపించడమే ఆయన ఉద్దేశ్యము.

అది కేవలము ఆరంభం మాత్రమే. ఆనాటి నుండి ఈనాటి వరకు దేవుడు తన పిల్లలతో మాట్లాడడం కొనసాగించారు. ప్రతి తరము యొక్క శిష్యులచేత ఆయన మాటలు కాపాడబడి, ప్రోగుచేయబడి, అధ్యయనం చేయబడ్డాయి. దేవుని చిత్తమును తెలుసుకొనగోరిన వారి చేత అవి గౌరవించబడ్డాయి. "తన సేవకులైన ప్రవక్తలకు తాను సంకల్పించిన దానిని బయలుపరచకుండా ప్రభువైన యెహోవా యేమియు చేయడు," అను సత్యమునకు వారు సాక్ష్యమిస్తున్నారు. [2]

ఆరంభమునుండి ఈ మాదిరిగా నున్నది, మరియు నేడు ఈ మాదిరి కొనసాగుతున్నది. ఇది ఒక మంచి బైబిలు కథ మాత్రమే కాదు; తన పిల్లలకు అవసరమైన సందేశాలను తెలియజేయడానికి దేవుడు ఏర్పరచిన మార్గమిది. ఆయన మన మధ్య వ్యక్తులను పుట్టించి, ప్రవక్తలుగా నుండుటకు వారిని పిలిచి, చెప్పుటకు వారికి మాటలనిచ్చెదరు. వాటిని "(ఆయన) నోటి నుండి పలికినట్లుగానే స్వీకరించవలెను," అని మనము ఆహ్వానించబడ్డాము. [3] "నా నోటి మాట ద్వారా గాని లేదా నా సేవకుల నోటి మాట ద్వారా గాని, అది ఒక్కటే" అని ఆయన ప్రకటించారు. [4]

పునరుద్ధరణ యొక్క అత్యంత మహిమకరమైన, ప్రోత్సాహకరమైన, నిరీక్షణనిచ్చు సందేశాలలో ఇది ఒకటి—దేవుడు మౌనంగా లేడు! ఆయన తన పిల్లలను ప్రేమిస్తున్నాడు. అంధకారములో తిరుగులాడుటకు ఆయన మనల్ని విడిచిపెట్టలేదు.

సంవత్సరానికి రెండుసార్లు, ఏప్రిల్ మరియు అక్టోబరులో మన అద్భుతమైన సర్వసభ్య సమావేశాల్లో ఆయన సేవకుల ద్వారా ప్రభువు స్వరమును వినడానికి మనకు అవకాశం గలదు.

సర్వసభ్య సమావేశంలో ఒక వక్త వేదిక వద్దకు రావడానికి చాలాకాలం ముందు నుండి తనకివ్వబడిన నియామకానికి స్పందనగా అతడు లేక ఆమె లోతైన ప్రయత్నము, ప్రార్థన మరియు అధ్యయనం చేస్తారని నా వ్యక్తిగత సాక్ష్యమునిస్తున్నాను. ప్రతీ సమావేశ సందేశము లెక్కలేనన్ని గంటల సిద్ధపాటును, తన పరిశుద్ధులు ఏమి వినాలని ప్రభువు కోరుతున్నారో గ్రహించడానికి చేయు హృదయపూర్వక విన్నపమును సూచిస్తుంది.

శ్రోతలుగా మనము వక్తలతో పాటు మన సిద్ధపాటును జత చేసినట్లయితే ఏమి జరగవచ్చు? నేరుగా ప్రభువు నుండి సందేశాలను పొందగల అవకాశంగా మనము సమావేశాన్ని చూసినట్లయితే, సర్వసభ్య సమావేశము పట్ల మన దృక్పథం ఏవిధంగా వేరుగా ఉండగలదు? మనము ఎదుర్కొంటున్న ప్రశ్నలు లేదా సమస్యలకు సర్వసభ్య సమావేశపు మాటలు మరియు సంగీతం ద్వారా వ్యక్తిగత సమాధానాలను పొందగలమని ఆశించవచ్చు.

పరలోక తండ్రి మీతో నిజంగా మాట్లాడతారా అని మీరు

ఆశ్చర్యపడుతున్నట్లయితే, మన ప్రాథమిక పిల్లలు పాడే సరళమైనప్పటికీ లోతైన పదాలను నేను మీకు జ్ఞాపకం చేస్తాను: “(మీరు) ఒక దేవుని బిడ్డ, ఆయన (మిమ్మల్ని) ఇక్కడికి పంపారు.” “ఏదో ఒకరోజు ఆయనతో జీవించడానికి” తిరిగి వెళ్ళేందుకు మీకు సహాయపడడమే ఆయన ఉద్దేశ్యము.

ఆయన బిడ్డగా మీరు పరలోక తండ్రిని సమీపించినట్లయితే, “నన్ను నడిపించుము, దారిచూపుము, నా ప్రక్కన నడువుము, దారి కనుగొనుటకు నాకు సహాయపడుము. నేను చేయవలసిన దానంతటిని నాకు నేర్పుము,” అని మనఃపూర్వకంగా మీరు ఆయనను అడగవచ్చు. ఆయన తన పరిశుద్ధాత్మ ద్వారా మీతో మాట్లాడతారు, అప్పుడు “ఆయన చిత్తమును చేయడం” మీ వంతు. మీరు చేసినట్లయితే, “ఘనమైన దీవెనలు దాచి వుంచబడ్డాయని” నేను వాగ్దానమిస్తున్నాను. [5]

ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నేడు ప్రభువు యొక్క నడిపింపు అవసరము. ప్రభువు మాటను వినడానికి మనము సిద్ధపడుచుండగా సత్యము యొక్క ఆత్మను మనము శ్రద్ధగా వెదికెదము, తద్వారా ప్రభువు తన సేవకుల ద్వారా మాట్లాడినప్పుడు మనము అర్థము చేసుకొని, ఆత్మీయాభివృద్ధిని పొంది, కలిసి ఆనందించగలము. [6]

“ఈ సంగతులను చేయుట ద్వారా నరకపు ద్వారములు (మన) యెదుట నిలువజాలవు; అవును, ప్రభువైన దేవుడు అంధకార శక్తులను (మన) యెదుట నుండి తరిమివేయును, (మన) మేలు కొరకు, ఆయన నామ ఘనత కొరకు పరలోకములు కంపించునట్లు చేయును,” అని నేను సాక్ష్యమిస్తున్నాను. [7]

వివరణలు

1. చూడుము ఆదికాండము 1:28.
2. ఆమోసు 3:7.
3. సిద్ధాంతము మరియు నిబంధనలు 21:5 చూడుము.
4. సిద్ధాంతము మరియు నిబంధనలు 1:38 చూడుము.
5. “I Am a Child of God,” *Hymns,* no. 301; *Children’s Songbook,* 2–3.
6. చూడుము సిద్ధాంతము మరియు నిబంధనలు 50:21–22.
7. సిద్ధాంతము మరియు నిబంధనలు 21:6 చూడుము.

---

ఈ సందేశము నుండి బోధించుట

సర్వసభ్య సమావేశముప్పుడు దేవునిచేత నియమించబడిన సేవకుల మాటలను మనము వినుచుండగా మన ప్రశ్నలు లేదా సమస్యలకు వ్యక్తిగత సమాధానాలను పొందగలము. మీరు బోధించు వారితో క్రింది వాటిని చర్చించడం గురించి ఆలోచించండి: సర్వసభ్య సమావేశముప్పుడు అటువంటి సమాధానాలను పొందడానికి మీరేవిధంగా సిద్ధపడగలరు? “సత్యము యొక్క ఆత్మను శ్రద్ధగా వెదకమని” అధ్యక్షులు ఉక్డార్ఫ్ గారు మనల్ని ప్రోత్సహిస్తున్నారు. దాని అర్థమేమిటని మీరనుకుంటున్నారు మరియు మీ సిద్ధపాటులో దీనిని మీరేవిధంగా చేర్చాలనుకుంటున్నారు? సిద్ధాంతము మరియు నిబంధనలు 21:6 లో చెప్పబడిన దీవెనలకు అదనంగా, ప్రభువు మాటలను ఆయన సేవకుల ద్వారా వినడానికి మీరు సిద్ధపడుచుండగా వచ్చు ఇతర దీవెనలేవి? ఈ సర్వసభ్య సమావేశంలో ఆత్మ వారికి బోధించు వాటిని దినచర్య పుస్తకములో వ్రాయమని మీరు బోధించువారిని మీరు ఆహ్వానించవచ్చు.

## యువత

### దేవుని యొక్క స్వరమును వినడానికి సిద్ధపడుట

స్త్రీ పురుషులను సృష్టించిన తరువాత దేవుడు చేసిన మొదటి పని వారితో మాట్లాడడం మరియు వారికి విలువైన సమాచారాన్ని,

సూచనలను ఇవ్వడం అనేది ఏవిధంగానో అధ్యక్షులు ఉక్డార్ఫ్ వివరించారు. ఏప్రిల్ మరియు అక్టోబరులో సర్వసభ్య సమావేశముప్పుడు, సంఘ నాయకులు ప్రసంగిస్తూ, ప్రభువు మనము వినాలని కోరిన సూచనలను మనకిచ్చినప్పుడు అదే దీవెనను మనం పొందుతాము.

సర్వసభ్య సమావేశముప్పుడు ఆయన సేవకుల ద్వారా దేవుని స్వరమును మీరెప్పుడైనా విన్నారా? మీరు వెదకుతున్న సమాధానాన్ని ఒక నిర్దిష్ట సందేశం మీకిచ్చినట్లు ఎప్పుడైనా భావించారా? ఆ అనుభవాన్ని మరియు అది మీకు సహాయపడిన

విధానాన్ని ఒక దినచర్య పుస్తకంలో మీరు వ్రాయవచ్చు. తరువాత మీకున్న ప్రశ్నలను వ్రాస్తూ, మీ లేఖన అధ్యయన సమయంలో వాటిని చదువుతూ రాబోయే సమావేశంలో ప్రభువు స్వరమును వినడానికి సిద్ధపడండి. సమావేశమప్పుడు సమాధానాలను, గ్రహింపును పొందాలని అడుగుతూ పరలోక తండ్రిని ప్రార్థించండి. ప్రభువు యొక్క సేవకులను వినుచుండగా, వ్యక్తిగత ప్రేరేపణల మీద దృష్టిపెట్టండి. మీరేమి నేర్చుకున్నారు? మారడానికి మీరేవిధంగా ప్రేరేపించబడ్డారు? ఆ ప్రేరేపణలను వ్రాయండి, ఎందుకనగా ఆత్మ మీతో మాట్లాడుతున్నది అదే!

పరలోక తండ్రి మిమ్మల్ని ప్రేమిస్తున్నారని, సరైన దిశలో మిమ్మల్ని నడిపిస్తారని ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకోండి. ఆయన సేవకుల ద్వారా ఆయన స్వరమును వినడానికి మీరు ప్రయత్నించినప్పుడు, మీరు దీవించబడి ఆత్మీయాభివృద్ధిని పొందుతారు.

## పిల్లలు

### సమావేశానికి సిద్ధపడండి!

ఈ ప్రేరేపణలను ఒక కాగితంపైన వ్రాయండి. సమావేశ సమయంలో కాగితాన్ని మీతోపాటు ఉంచుకొని, మీరు నేర్చుకున్న దానిని వ్రాయండి.

మీ ప్రశ్నలను వ్రాయండి. ...... గురించి నేను ఆశ్చర్యపడుతున్నాను.

పరలోక తండ్రిని ప్రార్థించండి. ...... గురించి నేర్చుకోవడానికి నాకు సహాయం కావాలి.

సర్వసభ్య సమావేశాన్ని వినండి. ..... నేను నేర్చుకున్నాను

ప్రథమ అధ్యక్షత్వము తిరిగి ఏర్పాటు చేయబడకముందు ఈ సందేశము సిద్ధపరచబడింది.

© 2018 by Intellectual Reserve, Inc. All rights reserved. Printed in USA. ఆంగ్ల ఆమోదము: 6/17. అనువాద ఆమోదము: 6/17. *First Presidency Message, March 2018* యొక్క అనువాదము. Telugu. 15049 421

# ప్రతీ సహోదరి కొరకు పేరుపేరున ప్రార్థించండి

ప్రత్యేకించి వారి పేరుతో ప్రతీ సహోదరి కొరకు మనము వినయంగా ప్రార్థించినప్పుడు, మనము దర్శించి బోధించు వారిపట్ల మన ప్రేమ మరియు ప్రేరేపణ అధికమవుతాయి.

విశ్వాసము, కుటుంబము, ఉపశమనము

ఇతరుల కొరకు వారి పేరుతో ప్రార్థించిన స్త్రీ పురుషుల యొక్క అనేక ఉదాహరణలను లేఖనములు తెలుపుతున్నాయి. అన్నింటిలోకి అత్యంత ఆసక్తిని కలిగించేది చిన్నవాడగు ఆల్మా యొక్క తండ్రిది. చిన్నవాడగు ఆల్మాతో ఒక దేవదూత అతని తండ్రి గురించి ఇలా చెప్పుచూ మాట్లాడెను, "....నిన్ను గూర్చి అధిక విశ్వాసముతో అతడు ప్రార్థన చేసియున్నాడు. కావున ఈ ఉద్దేశము నిమిత్తము, ఆయన సేవకుల ప్రార్థనలు వారి విశ్వాసమును బట్టి జవాబు పొందునట్లు దేవుని యొక్క శక్తి మరియు అధికారమును గూర్చి నిన్ను ఒప్పించుటకు నేను వచ్చియున్నాను" (మోషైయ 27:14).

ఒకరి కోసం ఒకరు ప్రార్థన చేయడమనేది, ప్రభువు మనకివ్వదలచిన దీవెనలను పొందడానికి మన హృదయాలను సిద్ధం చేస్తుంది. "ప్రార్థన యొక్క ఉద్దేశ్యము దేవుని చిత్తమును మార్చడం కాదు, కానీ మనకివ్వడానికి దేవుడు సిద్ధపరచిన దీవెనలను మన కొరకు మరియు ఇతరుల కొరకు భద్రపరచుకోవడం. అయితే ఆ దీవెనలను పొందడానికి మనము తప్పక అడగాలి."[1]

తన జీవితంలో సమస్యలున్నప్పుడు, "ప్రత్యేకించి కష్టకాలములో" తరచు తన దర్శించు బోధకురాళ్ళ నుండి ఒక ఫోను పిలుపు లేక చిన్న సందేశము వచ్చేదని ఒక సహోదరి వివరించింది. ఆమెకు ఎప్పుడు అవసరం కలిగేదో వారికి తెలుసనిపించేది. వారు తాము దర్శించినప్పుడు మరియు స్వతహాగా ఆమె కోసం ప్రార్థించారని ఆమెకు తెలుసు.

"ప్రతి ఉదయం మరియు రాత్రి ప్రతి సహోదరి మనఃపూర్వకంగా ప్రార్థించినట్లయితే లేక ఇంకా ఎక్కువగా ప్రభువు ఆజ్ఞాపించినట్లు నిరంతరము ప్రార్థించినట్లయితే, మనందరి బలం కలిసి ఎంతవుతుందో ఆలోచించండి," అని ప్రధాన ఉపశమన సమాజ మాజీ అధ్యక్షురాలు జూలీ బి. బెక్ అన్నారు.[2] మనము దర్శించి బోధించు వారి కొరకు ప్రార్థించడమనేది వ్యక్తులుగా మరియు కడవరి-దిన పరిశుద్ధ స్త్రీలుగా మనల్ని బలపరుస్తుంది.

ప్రథమ అధ్యక్షత్వమందు మొదటి సలహాదారులైన అధ్యక్షులు హెన్రీ బి. ఐరింగ్ ఇలా చెప్పారు: "వారి హృదయాలను తెలుసుకొనే మార్గం కొరకు ప్రార్థించండి. ... వారికి సహాయపడేందుకు మీరేమి చేయాలని దేవుడు కోరుతున్నారో మీరు తెలుసుకోవాలి మరియు వారి కొరకు దేవుని ప్రేమను అనుభవిస్తూ మీరు చేయగల సమస్తమును చేయాలి."[3]

వివరణలు


1. Guide to the Scriptures, "Prayer."
2. Julie B. Beck, "What Latter-day Saint Women Do Best: Stand Strong and Immovable," Liahona, Nov. 2007, 110.
3. Henry B. Eyring, "Priesthood and Personal Prayer," Liahona, May 2015, 85.


## దీని గురించి ఆలోచించండి

మీరు దర్శించి బోధించు ప్రతీ సహోదరి కొరకు ప్రార్థించినప్పుడు, ఇటీవల మీకు కలిగిన ప్రేరేపణ మరియు ఆలోచనలేవి?

## పరిచర్య చేయుట

పేరు పేరున ప్రతీ సహోదరి కొరకు ప్రార్థించుట ద్వారా, మనము దర్శించు ప్రతి సహోదరి యొక్క అవసరాలకు ఏవిధంగా స్పందించాలనే వ్యక్తిగత ప్రేరేపణను మనము పొందుతాము.

© 2018 by Intellectual Reserve, Inc. All rights reserved. Printed in USA. ఆంగ్ల ఆమోదము: 6/17. అనువాద ఆమోదము: 6/17. *Visiting Teaching Principles, March 2018* యొక్క అనువాదము. Telugu. 15049 421